క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పహాడీషరీఫ్: అమావాస్య సందర్భంగా జల్‌పల్లి గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్రీ ముత్యాలమ్మ తల్లి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నాయకులు యంజాల అర్జున్, సిద్దు, రఘురెడ్డి, బాబునాయక్, గంగునాయక్, వీరేశం, విష్ణువర్ధన్ రెడ్డి, భాస్కర్‌నాయక్, భాష, శంకర్, సాదిక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంలా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో సత్తా



సత్తా చాటిన రేయాన్ స్కూల్ విద్యార్థులు

నాగోలు: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్–2025 ఫలితాల్లో నాగోలులోని రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు చైర్మన్ జి. జనార్ధన్‌రెడ్డి తెలిపారు 8, 5వ తరగతి ప్రవేశాల కోసం జరిగిన జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించి మాట్లాడారు. జాతీయ స్థాయిలో రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థులు అశ్వర్థా 8 వతరగతి ప్రవేశానికి మొదటి ర్యాంకు, విపుల్ 5 ర్యాంకు సాధించాడు. 5 వ తరగతి ప్రవేశాలకు హనీష్‌రెడ్డి 4 వ ర్యాంక్ సాధించాడు. జాతీయ స్థాయిలో అమృత్ యాదవ్, శ్రీతేజ, సాకెత్, దీక్షత్ రాజ్‌రెడ్డి, అక్షిత్‌రెడ్డి, అకున్ బాలజీ, బాను ప్రసాద్, అద్విక్‌రాజ్, వంశీ మల్లెలలు టాప్ మార్క్‌తో పాటు 68 మంది విద్యార్థులు సత్తాచారన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

చైతన్యపురి: ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ సాయినగర్ కాలనీకి చెందిన రాధకు మంజూరైన రూ.1.5 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం లాంటిదని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాలా పనుల పూర్తికి వినతి



మేయర్ విజయలక్ష్మీకి వినతిపత్రం ఇస్తున్న సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలో నత్తనడకన జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతానాయక్ కోరారు. మంగళవారం జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మీకి కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుజాతానాయక్ మాట్లాడుతూ.. ఏపీఎస్ ఈబీ కాలనీ నుంచి బైరామల్‌గూడ చెరువు వరకు వరదనీటి కాలువ పనులు నత్తనడకన జరుగుతున్నాయని, వందనపురికాలనీ నుంచి కేకేగార్డెన్స్ వరకు పనులు ఇంకా మొదలు కాలేదని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మేయర్‌ను కోరారు.

అధ్వానంగా రహదారి

ఇబ్బంది పడుతున్న నేదునూరు, మాన్యగూడ వాసులు

- పట్టించుకోని పాలకులు



మాన్యగూడ-నేదునూరు రహదారి దుస్థితి

కందుకూరు: నేదు గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న మాన్యగూడ గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆ రహదారి మీదుగా మిగతా గ్రామాలకు అనుసంధాన మార్గం ఉంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ఒక్క కిలోమీటర్ దూరం

నేదునూరు మండలంలోనే మేజర్ పంచాయతీ. గ్రామానికి అనుబంధంగా మాన్యగూడ గ్రామం ఉంది. ఈ రెండు గ్రామాల మధ్య దూరం కిలోమీటర్ మాత్రమే. అనుబంధ గ్రామంలో దాదాపు 1,400పై చిలుకు జనాభా, 750 మంది ఓటర్లు ఉన్నారు. ఆ గ్రామస్తులు పంచాయతీ కార్యాలయానికి, మండల కేంద్రానికి వెళ్లాలన్నా ఒకటే మార్గం. ప్రస్తుతం ఆ రహదారి మొత్తం గుంతలమయమై తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే తమ గ్రామం గుర్తొస్తుందని, మిగతా సమయాల్లో ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి మరమ్మతులు చేపడితే గ్రామంతో పాటు దాసర్లపల్లి, రావిచేడు వైపు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పుతాయి. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి కనీసం మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

రూ.25 లక్షలు మంజూరు

నేదునూరు నుంచి మాన్యగూడ వరకు ఉన్న రహదారి మరమ్మతులకు రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో ఉంది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ పూర్తి చేసిన తర్వాత వెంటనే పనులు చేపడతాం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

– సతీష్‌రెడ్డి, ఏఈ పీఆర్, కందుకూరు

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులతో అమెజాన్ సంస్థ ప్రతినిధులు

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను అమెజాన్ సంస్థ, వేదాంషి ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. లైబ్రరీని ఏర్పాటు చేసి సుమారు 500 పుస్తకాలను ఏర్పాటు చేశారు. లైబ్రరీ రూమ్‌లో పెయింటింగ్స్ వేసి విద్యార్థులకు ఉపయోగపడే బొమ్మలు గీశారు. విద్యార్థులకు అమెజాన్ సంస్థ ప్రతినిధులు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. వారి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. భవిష్యత్‌లో పాఠశాలలో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని అమెజాన్ ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి యాదగిరి, పలువురు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై అవగాహన సదస్సు

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్యాలయంలో నేషనల్ ఆక్షన్ ఫర్ మెకానైజ్ శానిటేషన్ ఎకో సిస్టం కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందికి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సదస్సుకు మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి ముఖ్యులుగా పాల్గొని శానిటేషన్ సిబ్బందికి అవగాహన కల్పించారు. జెన్ రోబోటిక్ కేరళ సంస్థ రూపొందించిన విధానాన్ని సిబ్బందికి వివరించారు. శానిటేషన్ సిబ్బందికి ఆరోగ్య పరమైన సేఫ్టీకిట్స్, హెల్త్ ఇన్సూరెన్స్, సబ్సిడీ, వృత్తి పరమైన అంశాలపై మెలకువలు, సఫాయి వర్కర్లకు పీపీఈ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యామ్ సుందర్, మేనేజర్ బి.నాగేశ్వర్‌రావు, డిప్యూటీ డీఈఈ వెంకన్న, ఆర్ఓ వేణుగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, శానిటేషన్ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి



నూతనంగా కార్యవర్గానికి నియామకపత్రం అందజేస్తున్న రవీంద్రాచారి

మీర్‌పేట: దేశ జనాభాలో సగభాగం ఉన్న యువత రాజకీయాల్లోకి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మీర్‌పేట లెనిన్‌నగర్ 33వ వార్డు శాఖ మహాసభకు రవీంద్రాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దోపిడీ లేని సమాజం రావాలంటే యువశక్తితోనే సాధ్యమన్నారు. అవినీతి, నిరుద్యోగం, పేదరికం దేశంలో రోజు రోజుకు పెరిగిపోతోందని, యువకుల్లో చైతన్యం ద్వారానే వాటిని రూపుమాపవచ్చన్నారు. అనంతరం 33వ శాఖ నూతన కార్యదర్శిగా జటోత్ రెడ్యా నాయక్, సహాయ కార్యదర్శిగా మిరియాల లక్ష్మమ్మ, కౌన్సిల్ సభ్యులుగా కేతావత్ శ్రీనునాయక్, వడ్యా దత్తునాయక్, మహేందర్, గోవిందు నాయక్, కైలాస్‌నాయక్, వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. కార్యక్రమంలో పార్టీ బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు డేరంగుల శంకరయ్య రమావత్ పాండునాయక్, బండ యాదమ్మ, జాజుల అంజయ్య, ఛత్రునాయక్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

హయత్‌నగర్: ఆపరేషన్ కగార్ పేరిట ప్రభుత్వం అమాయక గిరిజనులను పొట్టనబెట్టుకుంటుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆందోజు రవీంద్రాచారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన కుంట్లూరులోని రాజీవ్‌గృహకల్ప సీపీఐ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి చర్చలకు మావోయిస్టులు ముందుకు వస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకుండా కాల్పులు జరపడం అప్రజాస్వామికమన్నారు. వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమసమాజ స్థాపనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సోషలిస్టు సమాజాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల జీవితాలలో మార్పు రావడం లేదని అవినీతిని, ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి హరిసింగ్ నాయక్, ప్రజా నాట్యమండలి నాయ కులు గణేష్, రాము, వెంకటేష్,బాబు, వలి, నర్సి ంహ, శ్రీను, హుస్సేన్ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించే వరకు పోరాటం

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



కడ్తాల్: పోలీసుల అదుపులో లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించేవరకు పోరాటం ఆగదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సంఘం మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తుగా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఏడాది కావొస్తున్నా నేటికి ప్రభుత్వం సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం దారుణమని అన్నారు. సమస్యలపై పోరాటం చేస్తుంటే అక్రమ అరెస్టులు చేయడం సరికాదని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

ఇబ్రహీంపట్నం: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరితే అక్రమంగా ముందస్తులు అరెస్ట్ చేయడం సరికాదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి అన్నారు. సంఘం పిలుపుమేరకు మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడి నేపథ్యంలో ఇబ్రహీంపట్నం పోలీసులు తులేకలాన్, రాయపోల్ మాజీ సర్పంచ్‌లు యాదగిరి, బల్వంత్‌రెడ్డి ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బల్వంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,200 కోట్ల బకాయిలకు రూ.153 కోట్లు మంజూరు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదని విమర్శించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పూజల పేరుతో మహిళకు టోకరా

నాగోలు: పూజల పేరుతో ఓ మహిళను నమ్మించి బంగారు ఆభరణాలు, నగదు కాజేసిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన నాగోలు ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం.. జైపురికాలనీ సమీపంలో వీరారెడ్డి కాలనీకి చెందిన గుండు రజనీ తన బంధువును తీసుకుని గురూజీ సాయిరాజ్ అనే వ్యక్తి వద్దకు వెళ్లింది. తాను వశీకరణ నిపుణుడని కుటుంబ సమస్యలకు పరిష్కారం చూపుతానని నమ్మించాడు. నీ భర్తపై మరొక మహిళ ప్రభావంతో విడిపోతాడని భయపెట్టాడు. సమస్య పరిష్కారానికి శక్తిపీఠాల్లో ప్రత్యేక పూజలు చేయాలని నమ్మించి రూ. 32 వేల నగదు, ఐదు తులాల బంగారు ఆభరణాలు తీసుకుని మోసం చేశాడు. వశీకరణ పేరుతో మరి కొన్ని పూజలు చేయాలని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి గత నెల 28న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం సాయిరాజ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మూడేళ్ల సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..



పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకట్రామ్, నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని 16వ వార్డులో నెలకొన్న అవుట్‌లెట్ సమస్య కారణంగా మూడేళ్లుగా ఇళ్ల మధ్య నీరు నిలుస్తుండడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందుల విషయమై సాక్షి దినపత్రికలో ఈ నెల 26వ తేదీన 'ఇంట్లో ఉండలేక.. వీధుల్లో నడవలేక' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌ను ఆదేశించింది. కమిషనర్‌తో పాటు గ్రామ నాయకులు యంజాల అర్జున్, వై.శివకుమార్‌లు స్పందించి వెంచర్‌లో నీరు నిల్వకుండా కార్గో రోడ్డు వద్ద ఉన్న నాలా వరకు పైపులైన్ వేస్తామని దిగువన ప్రజలకు సర్దిచెప్పారు. దీనికి అందరూ అంగీకరించడంతో మంగళవారం పనులను ప్రారంభించారు. ప్రజలు కొనుగోలు చేసిన 20 గజాల స్థలం నుంచి వెంచర్‌లో ఉన్న మ్యాన్‌హోల్ వరకు పైపులైన్ వేసి ఇళ్ల మధ్య నిలిచిన నీరు ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కార దిశగా ప్రయత్నించిన సాక్షి దినపత్రికకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

పట్టాలు ఇచ్చారు.. స్థలం చూపండి



ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న లబ్ధిదారులు, సీపీఎం నాయకులు

ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించిన ఇంటి పట్టాల లబ్ధిదారులు

కందుకూరు: ఇళ్ల సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులకు వెంటనే ఇళ్ల స్థలాల కబ్జా చూపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కందుకూరులో సర్వే నంబర్ 788, 107లో రెండేళ్ల క్రితం 530 మందికి ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు జారీ చేశారన్నారు. ఇంత వరకు కబ్జా మాత్రం చూపలేదన్నారు. గతంలో పేదలు ఆ సర్వే నంబర్‌లో గుడిసెలు వేసుకుంటే అధికారులు, పోలీసులు తొలగించారని ఆరోపించారు. ఎన్నోమార్లు పోరాటాలు చేసినా ప్రభుత్వంలో స్పందనే లేదన్నారు. ప్రస్తుతం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం, పేదలకు ఇంటి స్థలం కబ్జా చూపకపోవడం బాధాకరమన్నారు. ఇంటి స్థలం కబ్జా చూపితే ప్రభుత్వ పథకం కింద లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. కాగా వారి వద్దకు వచ్చిన ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి వారం రోజుల్లో స్థలం చదునుతో పాటు ప్లాట్లుగా విభజించడానికి అవసరమైన బడ్జెట్ కోసం కలెక్టర్‌కు నివేదించనున్నట్లు వారికి హామీ ఇచ్చారు. దీంతో వారు ధర్నాను విరమించి ఆయనకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు ఎం.ఇందిరమ్మ, శంకరమ్మ, బాలమణి, రామలక్ష్మి, కవిత, యాదమ్మ, లక్ష్మమ్మ, అండాలు, మహేందర్, రజియాబేగం, జంగమ్మ, సువర్ణ, అరుణ, జ్యోతి పాల్గొన్నారు.

సికింద్రాబాద్-మహేశ్వరం బస్సు సర్వీస్

ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీసుధ



మహేశ్వరం: రాణిగంజ్ డిపో నుంచి తుక్కుగూడ వరకు నడుస్తున్న 8ఏ, 253ఎం నంబర్ బస్సును మహేశ్వరం వరకు పొడిగించి నడిపిస్తున్నారని ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీసుధ తెలిపారు. కొన్నిరోజుల నుంచి రాణిగంజ్ డిపో నుంచి సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ కమాన్ వరకు బస్సు సర్వీస్‌ను నడిపిస్తున్నారని, దీనిని ప్రస్తుతం మహేశ్వరం మండల కేంద్రం వరకు బస్సును పొడిగించారని స్పష్టం చేశారు. మహేశ్వరం, తుక్కుగూడ, రావిర్యాల, శ్రీనగర్, మంఖాల్ ప్రాంతాల్లో భారీ పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ఇక్కడ బీహార్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, ఒడిసా, అస్సాం, హర్యానా పలు రాష్ట్రాల నుంచి కార్మికులు వచ్చి ఈ ప్రాంతాల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారు ఆ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే అక్కడివరకు ఆర్టీసీ బస్సులో వెళ్లడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. అంతేకాకుండా ఈ ప్రాంతాల ప్రజలు, ఉద్యోగులు హైద్రాబాద్ వెళ్లడానికి సులువు అవుతుందన్నారు. ఈ బస్సు రోజు నాలుగు ట్రిప్పులు తిరుగుతుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ ఆదాయం పెంచాలని కోరారు. బస్సు పొడిగించడంపై మహేశ్వరం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తరుముకొస్తున్న ముంపు ముప్పు!

- పూర్తికాని అధికారుల కార్యాచరణ
- నాలాల్లో తొలగించని పూడికతీత
- భయం గుప్పిట్లో లోతట్టు కాలనీలవాసులు



సైదాబాద్, సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో దుస్థితి(ఫైల్)

దిల్‌సుఖ్‌నగర్: వర్షాకాలం వస్తుందంటే చాలు.. మలక్‌పేట్‌జోన్ పరిధిలోని కాలనీలవాసులకు వెన్నులో వణుకు మొదలవుతోంది. ఏ అర్ధరాత్రి తమ ఇళ్లలోకి వరద వస్తోందోనని బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి వేధిస్తున్న ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల కురిసిన చినుకులకే ఇప్పటికీ పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగుతూనే ఉన్నాయి. నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా డ్రైనేజీలు పొంగి కాలనీలను దుర్గంధంగా మారుస్తున్నాయి.

ప్రారంభం కాని పూడికతీత పనులు..

◆ జోన్ పరిధిలోని సరూర్‌నగర్, మలక్‌పేట్, సంతోష్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని నాలాల్లో ఇంత వరకు పూర్తిస్థాయిలో చెత్తను తొలిగించలేదు.ఓపెన్ నాలాల పూడికతీత పనులు ఇంకా పూర్తికాలేదు. దీనికి తోడు వేసవిలో ఎక్కడిక్కడే రోడ్లను తవ్వి మళ్లీ మరమ్మతులు చేపట్టలేదు. లోతట్టు ప్రాంతాల ముంపు సమస్యపై ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో జోన్ పరిధిలోని ముంపు కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు.

◆ వర్షకాలం వచ్చిందంటే లోపట్టు ప్రాంతాల వాసుల కంటిమీద కునుకు కరువుతోంది. ఏళ్ల తరబడి ఈ సమస్యతో నరకయాతన అనుభివిస్తున్నారు. తమ జీవితాలు అతలాకుతలం అవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చినా ముంపు సమస్యకు ప్రధాన కారణాలైన ప్రధాన నాలాలు, డ్రైనేజీలలో చెత్తను ఇంత వరకు తొలిగించలేదంటే దీనికి సంబంధించిన అధికారుల నిర్లక్షమని అర్థమవుతుంది. ముంపు సమస్య పరిష్కారానికి అధికారులు దూర దృష్టితో ముందస్తు చర్యలు తీసుకోవపోవడం దురదృష్టకరం, వర్షం కురిస్తే నీరు రోడ్డుపై ఏరులై పారే ప్రమాదం ఉంది. వర్షం వచ్చిన ప్రతిసారీ కాలనీలు ముంపునకు గురవుతున్నా సమస్య అధికారుల్లో మాత్రం చలనం లేదు.

పర్యటనలు తప్ప పరిష్కారాలేవీ?

వర్షం వచ్చినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధిలు పర్యటనలే తప్ప ఏ కాలనీలో ఇప్పటి వరకు వర్షం నీటికి శాశ్వత పరిష్కారం చేయలేదు. దీంతో ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ముంపునకు గురయ్యే కాలనీల్లో డ్రైనేజీ, మ్యాన్‌హోళ్ల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం తవ్విన రోడ్లు గుంతలమయంగా మారినా ఇంత వరకు మరమ్మతులు చేపట్టకుండా కాలాయపన చేస్తున్నారు.